# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 26, మే 2026


రోడ్డు ప్రమాదంలో

## హెడ్ కానిస్టేబుల్ మృతి



■ రెబ్బెన పోలీస్‌స్టేషన్లో విషాదఛాయలు

రెబ్బెన, మే 25, ప్రభాతవార్త

రెబ్బెన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జాడి బాపూరావు, చెక్‌పోస్ట్ వద్ద విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి రెబ్బెన సీఐ, ఆసిఫాబాద్ డీఎస్పీ చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో పోలీసు శాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పైలట్ సేవలు భేష్..



### నేడు జాతీయ పైలట్ దినోత్సవం

సిర్పూర్ (టి ) మే 25, ప్రభాతవార్త:

కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ లోనూ ప్రాణాలను పణంగా పెట్టి కోవిడ్ బాధితులను ఆస్పత్రులు ఐసోలేషన్ కేంద్రాలు ఆస్పత్రి నుంచి ఇళ్లకు తరలించడంలో 108 వాహనాల పైలెట్లు ఆపద్బాంధవుడుగా విధులు నిర్వహించారు. కొంతమంది పైలెట్లు కోవిడ్ బారిన పడి కోలుకొని మళ్లీ విధుల్లో చేరి కోవిడ్ బాధితులకు సేవలు అందించారు. 108 పైలెట్లజాతీయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం... ప్రాణాపాయ స్థితిలో ఉర్నోగులను రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చడంలో పైలెట్లు

2లో..

కీలక పాత్ర పోషిస్తున్నారు. తమ ప్రాణాలతో పాటు బాధితుల వారితో పాటు వచ్చే సహాయకుల ప్రాణాలు సైతం పైలెట్ పై ఆధారపడి ఉంటాయన్న ఆలోచనతో అంబులెన్సను ఎంతో నైపుణ్యంతో నడుపుతూ సకాలంలో ఆసుపత్రికి చేర్చి పరోక్షంగా వారి ప్రాణాలు కాపాడుతున్నారు.

## వారం రోజుల్లో వడ్ల కొనుగోళ్లు పూర్తి చేస్తాం

✧ ధాన్యం అధిక దిగుబడి రావడంతో కొంతమేర ఆలస్యం

✧ రైతుల వద్ద నుంచి ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

✧ రైతులకు భరోసా కల్పించిన మంత్రి వివేక్ వెంకటస్వామి




చెన్నూరు, మే 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో ఈసారి యాసంగి వరి పంటలో అధిక దిగుబడి రావడంతో కొనుగోలు ఎక్కువ రోజులు జరిగాయని, అందువలన కొంత ఆలస్యం జరిగిందని, రైతుల వద్ద నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి వారం రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి ఒక ప్రకటన ద్వారా రైతులకు భరోసా కల్పించారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజలు ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఆందోళన చెందవద్దని మంత్రి వివేక్ వెంకటస్వామి మిగతా 2లో..

కోటి మంది మహిళలను..

## కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం





✦ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నిర్మల్, మే 25, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలను సీఎం వర్చువల్ విధానంలో నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి. అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు (వీవో భవనాలు) శంకుస్థాపనలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల మిగతా 2లో..

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



⁕ నలుగురు నిందితుల అరెస్టు..

⁕ అసలు సూత్రధారి పరార్...

తాండూర్, మే 25, ప్రభాతవార్త

తాండూర్ మండలంలోని రేచిని గ్రామ శివారులో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం తాండూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రేచిని గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు మిగతా 2లో..

# పైలట్ సేవలు భేష్..

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక శిక్షణ.... పైలట్‌గా ఎంపికైన వారికి హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అంబులెన్స్‌లో సుఖ ప్రసవం అయ్యే సమయంలో ఈఎంటిలకు ఎలా సహాయపడాలో శిక్షణ ఇస్తారు. వాహనంలో తీసుకొస్తున్న రోగి గుండెపోటు వచ్చిన సమయంలో ఎలాంటి ప్రథమ చికిత్స అందజేయాలో సిపిఆర్ పై శిక్షణ ఉంటుంది.

### 18 సంవత్సరాలుగా విధులు : తాజ్ పైలెట్ కాగజ్‌నగర్



18 సంవత్సరాలుగా పైలెట్ గా విధులు నిర్వహిస్తున్నాను. 108 వాహనంలో పైలెట్ పాత్ర కీలకమే కొన్ని సందర్భాలలో రోగికి ప్రథమ చికిత్స అవసరం ఉంటుంది ఈఎంటితో కలిసి చికిత్స అందిస్తాం. వాహనంలో ఎన్నో సుఖప్రసవాలు జరిగాయి . వాహనాల్లో తల్లి బిడ్డలను క్షేమంగా ఉన్న సమయంలో వారి కళ్ళలో కనిపించే ఆనందాన్ని చూస్తే మాకు సంతోషం కలుగుతుంది

### రోజు ప్రాణాలే మాకు ముఖ్యం : కొండపర్తి సుభాష్, పైలట్, కౌటాల



108 వాహనంపై పనిచేయడం అదృష్టంగా భావిస్తాం. కాల్ వచ్చిందంటే పేషంట్ ప్రాణాలను కాపాడాలన్నదే మా ముందున్న లక్ష్యంగా పనిచేస్తాం. 18 సంవత్సరాలుగా పైలట్ గా విధులు నిర్వహిస్తున్నాను. పేషెంట్ ని తీసుకొని సకాలంలో ఆసుపత్రికి తీసుకువచ్చే సమయంలో వేగంతో పాటు అందరి ప్రాణాలని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంటుంది . ఎంతో నైపుణ్యంతో వాహనాన్ని నడిపిస్తాం .

### సంతృప్తి నిచ్చేది : సునీల్ చింతలమానపల్లి



ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేషెంట్ ను ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలు దక్కితే సంతృప్తి కలిగేది. నాలుగేళ్ల కాలంలో ఎలాంటి పేషెంట్లను చేర్చిన ఆసుపత్రి వద్ద అశుభ వార్తలు వినిపించలేదు. పైలట్‌గా ఎంతో సంతోషం కలుగుతుంది.

### ఇంటికి వెళ్లకుండా ఉన్నాం : చిరంజీవి పైలెట్ సిర్పూర్ టి



కరోనా పేషెంట్లను ఆస్పత్రులకు చేర్చిన రోజుల్లో వారం రోజులపాటు ఇళ్లకు వెళ్లకుండా విధులు నిర్వహించారు. కరోనా అనుమానితులకు ఆసుపత్రులకు తీసుకెళ్లే సమయంలో ఎలాంటి భయాందోళనకు చెందకుండా ఉన్నాం. రోగిప్రాణాలు కాపాడాలని ఉంటుంది. రోగులను తీసుకెళ్లే సమయంలో మా గురించి ఆలోచించం.

## రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

**తాండూర్, మే 25, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామ పంచాయతీలో రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ మడవి ప్రభాత్రావు, నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బెజ్జాల గ్రామం నుండి బీర్సాయిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు పనులకురూ.5.80 లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు అయ్యాయన్నారు. బెజ్జాల గ్రామ రైతులు రహదారి మరమ్మతులు చేపడతామని చెప్పగానే రహదారికి భూమి ఇవ్వడం జరిగిందనీ, రైతులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ పరపత్ రావు, ఏపీఎం కుమారస్వామి, పంచాయతీ సెక్రెటరీ జగదీష్, నాయకులు పుట్ట శ్రీనివాస్, తిరుపతి, స్వామి, గ్రామ పెద్దలు మాణిక్ రావు, జంగు, తదితరులు పాల్గొన్నారు.



# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60,470 కోట్ల రుణాలు అందించామని, దీని ద్వారా సుమారు 5 లక్షల మంది మహిళలు వ్యాపారవేత్తలుగా మారారని సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దామని అన్నారు. మహిళా సంఘాలు పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.బ్యాంకు లింకేజీ, రుణ వసూళ్ల సాధనలో నిర్మల్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం ప్రశంసించారు. గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయంపై మహిళా సంఘాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నిర్మల్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణితో సీఎం వర్చువల్‌గా మాట్లాడి, జిల్లాలో మహిళా సంఘాల పనితీరును అభినందించారు. మళ్లీ జిల్లాకు వచ్చినప్పుడు నేరుగా కలుస్తానని చెప్పారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు. మండల మహిళా సమాఖ్యల ద్వారా పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ అంశాలపై విశేషంగా పనిచేసే మహిళా సమాఖ్యలను గుర్తించి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

పక్క సమాచార మేరకు తాండూర్ ఎస్సై ప్రసాద్, ఏవో సుష్మ, పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా చీరాలకు చెందితిరుమలశెట్టి రామకృష్ణ పొలాలును కౌలు చేసే గోగర్ల మల్లేశ్ మోటార్ సైకిల్ పై 30 కేజీల నకిలీ పత్తి విత్తనాలను తీసుకొని వస్తున్నాడు. ఇతన్ని అదుపులో తీసుకొని విచారించగా రేచిని, రోళ్లపాడు గ్రామాలకు చెందిన రైతులు ముక్క శ్రీకాంత్, గాండ్ల మహేష్, పిడుగు లక్ష్మణ్‌లకు విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపాడు. నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకొని నలుగురు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఏసిపి తెలిపారు నకిలీ పత్తి విత్తనాల సరఫరాలో అసలు సూత్రధారి అయిన తిరుమలశెట్టి రామకృష్ణ పరారీలో ఉన్నట్లు ఎసిపి తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలను ఎవరైనా సరఫరా చేసిన విక్రయించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎసిపి తెలిపారు. ఈ సమావేశంలో తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్, ఏవోసుష్మ పాల్గొన్నారు.

# వారం రోజుల్లో వడ్ల కొనుగోళ్లు పూర్తి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు సూచించారు. వారం రోజుల్లో వడ్ల కొనుగోలు పూర్తి చేస్తామని రైతుల వద్ద నుండి ప్రతి గింజ కొనుగోలు చేసి తీరుతామని అన్నారు. ఈసారి చెన్నూరు నియోజకవర్గంలో వరి పంట అంచనాలకు మించి అధిక దిగుబడి వచ్చిందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రైతులకు భరోసా కల్పించారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దీంతో కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని మంత్రి సూచించారు. చెన్నూరు ప్రాంతంలో ధాన్యం నిల్వ కోసం గోదాముల సౌకర్యాలను పెంచడంతో పాటు హమాలీల సంఖ్యను కూడా పెంచుతున్నామని పేర్కొన్నారు.

# మహిళా వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మే 25, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 25 నుండి 30 వరకు జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే మహిళ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్త రావులతో కలిసి మహిళా వారోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25న గ్రామ సంఘాల భవనాలు, మండల సమాఖ్య భవనాలు, భవనాల భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం, అంగన్వాడి టీచర్లు, పిల్లల తల్లిదండ్రుల కోసం వంట పోటీలను నిర్వహించాలని తెలిపారు. 26వ తేదీన ఖ౧బాల్య వివాహం బ్రతుకు ఆగం౧౧ నినాదంతో బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, 27న మహిళల భద్రత పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, మండల సమాఖ్యలో ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించాలని తెలిపారు. 29న రుణ మేళాలు నిర్వహించడం, స్వయం సహాయక సంఘాల జీవనోపాధి, యూనిట్ల రౌండింగ్ ప్రారంభించాలని తెలిపారు. 30న చివరి రోజున అమ్మ మాట అంగన్వాడీ బాట నినాదంతో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఏకరూప దుస్తుల పంపిణీ, విద్య ఆరంభ ధ్రువపత్రాల జారీ, కిశోర బాలికల కొరకు స్నేహ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళా వారోత్సవాల విజయవంతం కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత, అధికారులు

# ముగిసిన సమ్మర్ శిబిరం కార్యక్రమం

- జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో పర్యావరణ స్పృహ పెంపొందించిన సమ్మర్ శిబిరం
- విద్యార్థులకు ప్రశంసాపత్రాల ప్రదానం - పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు జాడి దేవాజి

**కాగజ్‌నగర్ రూరల్, మే 25, ప్రభాతవార్త :**

పీఎం శ్రీ పాఠశాలల పరిధిలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఓల్డ్ కాగజ్‌నగర్‌లో నిర్వహించిన సమ్మర్ శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి దేవాజీ అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వనరుల నిపుణులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ వేసవి సెలవులను సృజనాత్మకంగా వినియోగించుకునే ఉద్దేశంతో నిర్వహించిన సమ్మర్ శిబిరం ద్వారా విద్యార్థుల్లో అనేక ప్రతిభలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. శిబిరంలో భాగంగా ఆటలు, నృత్యాలు, పాటలు, కళలు – చేతిపనులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించబడినట్లు తెలిపారు. ప్రకృతి సంరక్షణ, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన, నీటి సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు వివిధ కార్యాచరణల ద్వారా అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యావరణ కార్యకలాపాల భాగంగా పర్యావరణ అవగాహన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రశంసాపత్రాలను స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ హరిత దళం జిల్లా సమన్వయకర్త, పర్యావరణ విద్యా రాయబారి కటుకం మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణం పట్ల స్నేహభావం, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. నేటి వాతావరణ మార్పులకు, ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతున్న అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన నైపుణ్యాలను అలవర్చుకోవాలని కోరారు. అలాగే ఆటలు, పాటలు, నాటికలు, చిత్రలేఖనం వంటి కళారూపాల ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహను పెంపొందించవచ్చని తెలిపారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసే ఇటువంటి సమ్మర్ శిబిరాలు భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై సందేశాత్మక పాటలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, వనరుల నిపుణులు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు.


వివో భవన నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న సర్పంచ్ ప్రభాత్ రావ్

## నర్సాపూర్‌లో వివో భవన నిర్మాణానికి భూమి పూజ

**తాండూర్, మే 25, ప్రభాతవార్త :**

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సోమవారం వివో భవన నిర్మాణం పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడవి ప్రభాత్ రావు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం శ్యామల, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సాయి లత, ఉప సర్పంచ్ మడావి పరబత్ రావు, పంచాయతీ సెక్రటరీ జగదీష్, వార్డు సభ్యులు, ఐకేపీ ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న తుడుం దెబ్బ నాయకులు

## 29న రౌటసంకెపల్లికి రాష్ట్ర గవర్నర్ రాక

- బహిరంగ సభను విజయవంతం చేయండి
- తుడుం దెబ్బ జాతీయ పొలిట్ బ్యూరో చైర్మన్ బుర్స పోచయ్య

**తాండూర్, మే 25, ప్రభాతవార్త :**

ఈనెల 29న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రౌటసంకెపల్లి గ్రామానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల రానున్నట్లు తుడుం దెబ్బ జాతీయ పొలిట్ బ్యూరో చైర్మన్ బుర్స పోచయ్య తెలిపారు. గవర్నర్ పర్యటనకు సంబంధించిన కరపత్రాలను సోమవారం తాండూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపూడి ఆశలత, రాయపూడి నాగేంద్ర రౌటసంకెపల్లి గ్రామాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేయాలనే గొప్ప సంకల్పంతో దత్తత తీసుకున్నారని తెలిపారు. గవర్నర్ రాక సందర్భంగా సుమారు 20 వేల మంది జనాభాతో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి యపాల సమ్మయ్య, కిష్టంపేట మాజీ సర్పంచి గడ్డం మణికుమార్, కొలవార్ సంఘం మండల అధ్యక్షులు గొలిశెట్టి బాపు మండల నాయకులు టేకం రాజేష్, ఊరడి వెంకటేష్, టేకం రాజయ్య, ఊరడి హనుమంతు, కోయ రాజు, చింతపూరి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## ఐబిలో అంబలి, మజ్జిగ పంపిణీ

**తాండూర్, మే 25, ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన ఐబీలో సోమవారం శ్రీ రామాంజనేయ బైక్ మెకానిక్ వర్క్స్ వారి ఆధ్వర్యంలో అంబలి, మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ చేశారు. వేసవి తీవ్రత ను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వొడ్నాల శ్రవణ్ కుమార్, మోనిక, యశోద, ఆధ్య, తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ, అంబలి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

# గూడెం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**దండేపల్లి, మే 25, ప్రభాతవార్త**



ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించడం, నేరాల నియంత్రణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడెం గ్రామంలో సోమవారం లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమణమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన, చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్న సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ కలిగిన వాహనాలనే వినియోగించాలని సీఐ సూచించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని, రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మరణాలు హెల్మెట్ వినియోగం లేకపోవడం వల్లనే జరుగుతున్నాయని వివరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని ప్రజలకు సూచించారు. సోషల్ మీడియా, మొబైల్ యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి సైబర్ మోసానికి గురైనా వెంటనే పోలీసులను లేదా సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు, అభ్యంతరకర పోస్టులు షేర్ చేయడం వల్ల చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే పోస్టులకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, మహిళలు వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్న సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట సీఐ రమణ మూర్తి, లక్షెట్టిపేట ఎస్సై సురేష్, జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్, దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్‌తో పాటు సుమారు 30 మంది పోలీసు సిబ్బంది, గ్రామానికి చెందిన సుమారు 100 మంది స్థానిక ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పటేల్

## చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పటేల్

**భైంసా, మే 25, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ముధోల్ మండల కేంద్రానికి చెందిన సుధారాణి, ఆస్టా గ్రామానికి చెందిన సురుగుర పోశెట్టి, వడ్తాల్ గ్రామానికి చెందిన శివశక్తిలకు ఈ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి, జూపల్లి కృష్ణారావుకు, అలాగే మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, ప్రేమ్‌నాథ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ చంద్రయ్య, వివిధ మండలాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



నిర్మల్ బస్టాండ్ సమీపంలో ప్రతిష్టించిన దివంగత ఎంపీ నర్సారెడ్డి విగ్రహం

## నరసన్న బాపు విగ్రహ ప్రతిష్టాపన

**సారంగాపూర్, మే 25, ప్రభాతవార్త:**

మండలంలోని చించోలి (బి) గ్రామ నివాసి అయిన నరసన్న బాపు (మాజీ ఎంపీ నర్సా రెడ్డి) పేరు చుట్టుపక్కల గ్రామాలలో చిన్న, పెద్ద అని తేడా లేకుండా తెలియని వారు లేరు. నిర్మల్ నియోజకవర్గానికే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటా మారుమోగిన పేరు నరసన్న బాపు అని, ఆయన ప్రజాసేవను గుర్తించి ఎన్నో పదవులు వరించాయని మండలంలోని వృద్ధులు తెలిపారు. నరసన్న బాపు విగ్రహాన్ని నిర్మల్ బస్టాండ్ సమీపంలో ప్రతిష్టించారనే విషయం తెలుసుకుని మండల ప్రజలు ఒకరికొకరు చెప్పుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఆయన చాలా మృదుస్వభావి, మంచి మనిషి అని కొనియాడారు. పెద్ద జమీందారు అయినప్పటికీ ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటూ, ప్రజాసేవ చేయాలనే తపన ఆయన మదిలో ఉండేదని మండల ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## నిర్మల్ రాజ్యాధికార సభను జయప్రదం చేయండి: జేఏసీ నేత సుంకేట పోశెట్టి

**భైంసా, మే 25, ప్రభాతవార్త:**



మే 27న నిర్మల్‌లో నిర్వహించనున్న రాజ్యాధికార సభను బడుగు, బలహీన వర్గాలు విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నిర్మల్ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు సుంకేట పోశెట్టి కోరారు. భైంసా పట్టణంలో ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక కులాలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభలలో వాటా దక్కాలన్నారు. మనమెంత మందిమో మనకంత వాటా కోసం జరిగే ఈ సామాజిక న్యాయ పోరాటంలో భాగంగా నిర్మల్ జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ ఆత్మగౌరవాన్ని చాటాలని పిలుపునిచ్చారు.





# రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత

**✪ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి**

**నస్పూర్, మే 25, ప్రభాతవార్త**

రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం చేపట్టిన మహిళ వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), ఇతర మంత్రులు, ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మహిళ సంఘాల సభ్యులు, మహిళలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. మహిళలు ఆత్మస్థర్యంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం వివిధ వ్యాపార రంగాలలో మరియు మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని, సోలార్ ప్లాంట్లు, ఆర్ టి సి బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి వ్యాపారాలను సైతం మహిళలు నిర్వహించేలా తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, రిలయన్స్ వంటి పెట్రో సంస్థల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక లబ్ధి జరిగేలా పెట్రోల్ బంకుల నిర్వహణకు చర్యలు చేపట్టడంతో పాటు ఆర్ టి సి సంస్థకు అద్దె బస్సుల ఒప్పందంతో అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచి దాదాపు 60 వేల 471 కోట్ల రూపాయలు అందించడం జరుగుతుందని, వడ్డీ లేని రుణ సదుపాయం ద్వారా స్వయం సహాయక సంఘాలకు 1 వేయి 390 కోట్ల రూపాయలు అందించి వ్యాపార అభివృద్ధికి దోహదపడటం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము పొందిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా మరింత రుణ సదుపాయం కలుగుతుందని, మరింత మందికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 8 వేల 500 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేసి, లారీలు, హమాలీల సమస్య లేకుండా రైతు సంక్షేమంలో భాగంగా చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాలకు భవిష్యత్తులో రైస్ మిల్లుల స్థాపన, నిర్వహణకు మహిళ సంఘాలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాల అధికారులు వారి జిల్లా పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి రైస్ మిల్లులు, గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వ భూముల అనుకూలతను పరిశీలించి నివేదిక సమర్పించాలని తెలిపారు. మహిళా శక్తి సూపర్ బజార్ ల ఏర్పాటుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తుందని, నిత్యవసర సరుకులు, అత్యవసరాలు అన్ని సూపర్ బజార్ లో అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను మహిళా సంఘాలకు నామమాత్రపు అద్దె ప్రాతిపదికన కేటాయించి మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వర్షానికి తడిసిన మొక్కజొన్న, వరి ధాన్యం

## అకాల వర్షంతో తడిసిన పంటలు

**- ఆవేదనలో రైతులు**

**సారంగాపూర్, మే 25, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి), సారంగాపూర్, జాం గ్రామాలలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో ఐకేపీ కేంద్రాలు, మార్కెట్లలో ఆరబోసిన మొక్కజొన్న, వరి పంటలు పూర్తిగా తడిసిపోయాయి. ఒక్కసారిగా ఈదురుగాలులు వీచడంతో ధాన్యంపై కప్పిన తార్పాలిన్ కవర్లు లేచిపోయి పంట అంతా నానిపోయింది. ఒకవైపు ప్రకృతి సహకరించక, మరోవైపు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పండించే కంటే కూలి పనులు చేసుకోవడం నయమనే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందారు. రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక అనే మాటలు కేవలం చెప్పుకోవడానికే పనికివస్తున్నాయని రైతులు మండిపడ్డారు. ఎంతో కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకువస్తే బస్తాలకు, వాటిని తరలించడానికి లారీలకు, హమాలీలకు తామే డబ్బులు చెల్లించుకోవాల్సి వస్తోందని ఆరోపించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు రైతుల పట్ల ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందని, ఇలాంటి ప్రభుత్వాన్ని, అధికారులను తామెప్పుడూ చూడలేదని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే ఎలాంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## తాండూరు, నెన్నల, వేమనపల్లి మండలాల్లో జూనియర్ కళాశాలలు ప్రారంభించాలి

**- బిఆర్ఎస్వి డిమాండ్**

**బెల్లంపల్లి, మే 25, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూరు, నెన్నల, వేమనపల్లి మండలాలకు మంజూరు అయిన జూనియర్ కళాశాలలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఏఓ హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు మండలాల్లో జూనియర్ కళాశాలలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం మూడు మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరు చేసినప్పటికీ, ఇప్పటి వరకు తరగతులు ప్రారంభం కాలేదని విమర్శించారు. కేవలం పత్రాలకే పరిమితమైన ఈ కళాశాలల కారణంగా సుమారు 1500 మంది పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జూనియర్ కళాశాలలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి పట్టణ కార్యదర్శి వడ్డేపల్లి నితీష్, నాయకులు అరవింద్, వరుణ్, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మే 25, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పొగాకు బుచ్చిబాబు తాము కొనుగోలు చేసిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టి కొంతమేర చేసి అనివార్య కారణాలతో నిలిపివేయడం జరిగిందని, నిర్మాణ గడువును పొడిగిస్తూ అనుమతి పత్రం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి పట్టణం ఒర్రెగడ్డ ప్రాంతానికి చెందిన బర్ల సుగుణ తన భర్తకు చెందిన ఆస్తిని ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు తన పేరిట మార్పు చేసుకునేందుకు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ క్రమంలో ఆస్తి మార్పిడిపై విచారణ జరిపి తమను రక్షించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం సింగాపూర్ కు చెందిన సల్లూరి పోశమ్మ తన భర్త పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆయన మరణించారని అట్టి ఇంటిని తనకు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన మద్దెల గట్టయ్య తనకు గుడిపేట శివారులో గల భూమి రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదు అయిందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బొల్లం సుజాత తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్ 1 జాబితాలో ఉండి ఫేజ్ 1, 2 జాబితాలో పేరు



రాలేదని, ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్‌కు చెందిన గెరిక దుర్గ తాము పూల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని, రెండు పడక గదుల ఇండ్లలో లక్కీ డ్రా పద్ధతిన ఇల్లు వచ్చిందని, సర్వే చేసి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ సర్వర్ బి తన భర్త చనిపోయాడని, పిల్లల పోషణ కొరకు తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 91 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ముధోల్ మాజీ శాసనసభ్యులు జీ విఠల్ రెడ్డి

## చెక్కులు పంపిణీ చేసిన మాజీ శాసనసభ్యుడు జీ విఠల్ రెడ్డి

**భైంసా, మే 25, ప్రభాతవార్త:**

ముధోల్ మాజీ శాసనసభ్యులు జీ విఠల్ రెడ్డి భైంసాలోని తన నివాసంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు. కుబీర్ మండలంలోని దొడర్నా తండా గ్రామానికి చెందిన సంతోష్ అనే లబ్ధిదారునికి రూ.21,005, కుంటాల మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ముస్కు భోజన్నకు రూ.15,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, మాజీ శాసనసభ్యులు జీ విఠల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంజయ్, మాజీ సర్పంచ్ రమణాగౌడ్, దొడర్నా సర్పంచ్, నాయకులు వెంకటేష్, దేవిదాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కుర్మే మహేందర్‌ను సన్మానించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్

**నేరడిగొండ, మే 25, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కుర్మే మహేందర్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న కుర్మే మహేందర్‌కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు రావడం బోథ్ నియోజకవర్గానికి గర్వకారణమన్నారు. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ వర్గాల అభివృద్ధికి ఆయన మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సామాన్యుడి నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలు పెంచుతోంది

**ఆసిఫాబాద్ టౌన్, మే 25, ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అదనపు భారం మోపడం బాధాకరమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఇంధన ధరల పెంపుతో రవాణా ఛార్జీలు, సరుకు రవాణా ఖర్చులు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తూ సాధారణ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. వెంటనే పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది

## రోల్ మామడలో ఉచిత వైద్యశిబిరం: హెచ్ఈఓ పవార్ రవీందర్

**నేరడిగొండ, మే 25, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపినప్పుడే జీవితం సాఫీగా సాగుతుందని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. నేరడిగొండతో పాటు రోల్ మామడ గ్రామంలో జన్ భాగీదారీ పీఎం జన్మన్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామస్తులకు రక్తపోటు (బీపీ), షుగర్ మరియు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం భవనానికి భూమి పూజ

**జైపూర్,మే 25, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో సోమవారం మహిళా సంఘం భవనానికి భూమి పూజ చేశారు. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూన భాస్కర్, ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, నాయకులు అంబల్ల సంపత్ రెడ్డి, అరిగెల శ్రీనివాస్ గౌడ్, ఇరిగిరాల లింగయ్య, ఏపీఎం సంతోష్ కుమార్, స్థానిక మహిళా సంఘం మహిళలు పాల్గొన్నారు.





## గ్రామ సమైక్య భవనానికి భూమి పూజ

**లింగాపూర్, మే 25, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని ఎలాపాటర్ గ్రామం లో గ్రామా సమైక్య భవనానిక భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ జాదవ్ బబ్లునాయక్ మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక ప్రగతి, అక్షరాస్యత సాధించుటకు ఇదొక చక్కటి వేదికగా గ్రామ సమైక్య భవనం ఉపయోగపడుతుందని కొనియాడారు. గ్రామంలోని ప్రతి ఒక్క మహిళ సంఘంలో ఉండి ఐక్యమత్యంతో వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్య అధ్యక్షురాలు సెడమకి అంజన్న బాయి, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, మాజీ ఓ ఆప్షన్ సభ్యుడు షేక్ సలీం, వివిధ సంఘాల మహిళలు పాల్గొనడం జరిగింది.

## వైభవంగా శబరిమాత వార్షికోత్సవ వేడుకలు

**నేరడిగొండ, మే 25, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలో శబరిమాత ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలను భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయానికి ప్రజలు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకుని మంచి నడవడికను అలవర్చుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె. హరిత

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, మే 25, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన నాగేష్ తాను కొనుగోలు చేసిన భూమిని భూభారతిలో ఆన్ లైన్ చేసి పాస్ పుస్తకాలలో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ యు మండలం మహాగాం గ్రామానికి చెందిన కొడప హిరామన్ తాను గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా పని చేస్తుండగా విధుల నుండి తొలగించినందున తిరిగి ఉపాధి కల్పించాలని, సిర్పూర్ యు మండలం కోహినూరు గ్రామానికి చెందిన మండాడి రంభ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామానికి చెందిన రాజయ్య తాను తెలంగాణ ఉద్యమంలో పనిచేసినందున తనకు ఆర్థిక సహాయం ఇప్పించాలని, రెబ్బెన మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సునార్ కార్ లింగయ్య తన భూ సమస్యను పరిష్కరించాలని, కాగజ్ నగర్ మండలం బోరిగం గ్రామానికి చెందిన సాహస్తి తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని బ్రాహ్మణవాడకు చెందిన విజయ్ కుమార్ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ మండల ఐకేపీ వీవోఏల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**కాగజ్‌నగర్ రూరల్, మే 25, ప్రభాతవార్త :**

మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు, వీవోఏలు, సభ్యుల సమక్షంలో కాగజ్‌నగర్ మండల పరిధిలోని ఐకేపీ వీవోఏల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా వనిత, కోశాధికారిగా ప్రమీల, ఉపాధ్యక్షుడిగా పెంటయ్య, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతి, అంజలి, గీతలను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా లత, సౌందర్య, రజిత, కళ్యాణి, వినోద్, శంకరన్న, గణేష్, శ్రీలత, సంధ్య, సుగుణాకర్, రెహానా, రాజ్ మహమ్మద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి, గ్రామీణ పేదల సంక్షేమం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు కోసం సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. సంఘాల బలోపేతం, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులను వీవోఏలు, సంఘ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిర్మల్, మే 25, ప్రభాతవార్త:**



జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌ను అందంగా అలంకరించాలని, ప్రధాన వేదికను పూలతో ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. అందరి కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు. జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు

**క్యాతన్‌పల్లి, మే 25, ప్రభాతవార్త**




సోమవారం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు జరిగాయి. మందమర్రి ఏరియా జి.ఎం రాధకృష్ణ, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మధు కుమార్‌లు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య రక్షణ, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా సిబ్బంది పునరంకితం కావాలని అన్నారు. కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడంలో ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. మందమర్రి ఏరియా పరిధిలోని అత్యంత కీలకమైన, నాణ్యమైన వైద్య సేవలకు నిలయమైన ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగులతో ప్రత్యేక మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్షా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో అధికారులు హాజరై దిశానిర్దేశం చేశారు.ఎంతో సుదీర్ఘమైన చరిత్ర, నమ్మకమైన వైద్య సేవల రికార్డు కలిగిన ఈ ఆసుపత్రి, రాత్రి పగలు తేడా లేకుండా ఉద్యోగుల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతరం అచంచలమైన సేవలను అందిస్తూ ఏరియాకు ప్రధాన ఆరోగ్య వనరుగా నిలిచిందని కొనియాడారు. అత్యవసర సమయాల్లో క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితుల్లోనూ వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ తమ నైపుణ్యంతో ప్రాణాలను కాపాడుతూ అందిస్తున్న సేవలు అమోఘమైనవని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో అధునాతన వైద్య సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ, హాస్పిటల్ నిర్దేశించుకున్న హెల్త్ కేర్ లక్ష్యాలను సాధించి, సంస్థలోనే ఆదర్శవంతమైన ఏరియా ఆసుపత్రిగా అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ విస్తృత స్థాయి సమావేశాలలో కంపెనీ నిర్దేశించుకున్న నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉత్పాదకత, వైద్య సేవల విస్తరణ లక్ష్యాల సాధనపై సుదీర్ఘంగా చర్చించారు. ఆసుపత్రిలో సురక్షితమైన, పరిశుభ్రమైన పని వాతావరణం, శాస్త్రీయ ఆరోగ్య రక్షణ పద్ధతుల పెంపుదల, సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల, రోగుల కొరకు అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, మందుల లభ్యత ఆర్థిక (ఫైనాన్స్) సంబంధిత విషయాలను అధికారులు ఉద్యోగులకు వివరించారు. హాస్పిటల్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, రాబోయే రోజుల్లో ఎదుర్కోబోయే సవాళ్లు, వాటిని అధిగమించి రోగులకు మెరుగైన ఓపి, ఐపి సేవలను ఎలా అందించాలో చర్చించారు.ఆసుపత్రి సిబ్బంది యాజమాన్యం సూచించిన సలహాలు, సూచనలను నిరంతరం పాటించడం ద్వారా వైద్య సేవల నాణ్యతను మరింత పెంచవచ్చని అధికారులు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం తమ ఉద్యోగులకు అందించే ఉచిత వైద్య సహాయంలో నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సమగ్ర నాణ్యతా నియంత్రణ చర్యలను చేపట్టిందని, రోగులకు అత్యుత్తమ శ్రేణి చికిత్సను అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వైద్య సేవలు అందించే క్రమంలో నాణ్యత, రోగుల భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ అందించే చికిత్సా ప్రమాణాలకు ఎంతో మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ డి.జి.ఎం అశోక్, ఐ.ఈ.డి డి.జి.ఎం కిరణ్ కుమార్, ఐ.ఈ.డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, హాస్పిటల్ వైద్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన ముక్రా సర్పంచ్: ఇంచార్జ్ ఆడే గజేందర్

**నేరడిగొండ, మే 25, ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయని, అదే నమ్మకంతో పార్టీలోకి చేరికలు పెరుగుతున్నాయని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. నేరడిగొండ మండలంలోని క్యాంప్ కార్యాలయంలో ఇచ్చోడ మండలంలోని ముక్రా (కే) గ్రామ సర్పంచ్ గైక్వాడ్ జైపాల్, ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితో పాటు కాకడే గజానంద్, కాసాని విష్ణు, గజానంద్, తిరుపతి, అశోక్, సచిన్, ఆకాష్, సంతోష్, దీపక్, రవికాంత్, శ్రీధర్, పరశురాం, గంగాధర్, మధుకర్, సాయినాథ్, గంగాధర్, ప్రకాష్, నానేశ్వర్, నారాయణ, అనిల్ కుమార్, దినేష్, గోపాల్, సునీల్, మారుతి, ప్రభాకర్, అనిల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముక్రా (కే) సర్పంచ్ గైక్వాడ్ జైపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బోథ్ నియోజకవర్గంలో ఆడే గజేందర్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని, గ్రామ స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయని, అదే నమ్మకంతో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.